సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

గురువారం । 12 । డిసెంబర్ । 2024



సోమశిలలో 72.552 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో బుధవారానికి 72.552 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి 3250 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.80,100
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.7,262
3 శాతం జీఎస్టీతో	రూ.7,480
నవర (8 గ్రా)	రూ.59,840



వాతావరణం

జిల్లాలోని ఒకట్రెండు చోట్ల వర్షాలు గురువారం కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. గాలిలో తేమ 86 శాతంగా బుధవారం నమోదైంది.

న్యూస్‌రీల్

నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు

నెల్లూరు రూరల్: బీఎస్సీ నర్సింగ్, పోస్ట్ బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసిన నిరుద్యోగ యువతకు సౌదీ అరేబియాలోని రిహ్యాబిలిటేషన్ సెంటర్లలో ఉద్యోగావకాశాలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఓఎంసీ ఏపీ, అల్ యూసఫ్ ఎంటర్‌ప్రైజెస్ ఆధ్వర్యంలో కల్పించనున్నామని జిల్లా ఉపాధి కల్పనాధికారి వినయ్‌కుమార్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఖయ్యూం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల యువత ఈ నెల 15లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, ఏదైనా ఆస్పత్రిలో ఏడాదిన్నర అనుభవం ఉండాలని చెప్పారు. ఆసక్తి గల వారు 90691 09999 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

31లోపు లైసెన్స్ ఫీజు చెల్లించాలి

నెల్లూరు(సెంట్రల్): జిల్లాలోని ఫ్యాక్టరీల యాజమాన్యాలు 2025కు సంబంధించిన రన్నింగ్ లైసెన్స్ ఫీజును ఈ నెల 31లోపు ఆన్‌లైన్లో చలానా రూపంలో చెల్లించాలని ఫ్యాక్టరీల ఇన్‌స్పెక్టర్ శైలేంద్రకుమార్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. లేని పక్షంలో అపరాధ రుసుమును విధించనున్నామని చెప్పారు. ఏడాది రిటర్న్స్‌ను ఆన్‌లైన్లో ఏప్రిల్‌లో పొందుపర్చాలని కోరారు. వివరాలకు 85558 41701 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

కసురుగా సముద్రం



ఇందుకూరుపేట: అల్పపీడన ప్రభావంతో సముద్రం కసురుగా మారింది. అలలు ఓ మోస్తరుగా ఎగసిపడుతున్నాయి. ప్రతికూల వాతావరణం కారణంగా మైపాడు బీచ్‌కు పర్యాటకుల రాక తగ్గుముఖం పట్టింది.

సాంఘిక సంక్షేమ శాఖ డీడీగా శోభారాణి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా డిప్యూటీ డైరెక్టర్‌గా శోభారాణిని నియమిస్తూ ఉత్తర్వులను ప్రభుత్వం బుధవారం జారీ చేసింది. పశ్చిమగోదావరి జిల్లాలో డీఎస్‌డబ్ల్యూఓగా పనిచేస్తున్న ఈమెను ఉద్యోగోన్నతిపై ఇక్కడ నియమించారు. ఒకట్రెండు రోజుల్లో బాధ్యతలను ఆమె స్వీకరించనున్నారు.

కూతకు నోచుకోని మెట్ట

రైలు కూతకు జిల్లాలోని మెట్ట ప్రాంతాలు నోచుకోవడంలేదు. నడికుడి – శ్రీకాళహస్తి రైల్వే లైన్ పూర్తయి తమకు ట్రైన్ భాగ్యం దక్కుతుందని ఏళ్లుగా ఈ ప్రాంత ప్రజలు నిరీక్షిస్తున్నారు. గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో దర్శి వరకు ట్రయిల్ రన్‌ను నిర్వహించడంతో ఆశలు చిగురించినా, ప్రభుత్వం మారడంతో ఇవి మళ్లీ మొదటికొచ్చాయి.

ప్రాజెక్ట్ తీరుతెన్నులు

రైల్వేలైన్ పొడవు - 309 కిలోమీటర్లు	మంజూరైన ఏడాది - 2011 - 12
అంచనా వ్యయం - రూ.2,289 కోట్లు	రాష్ట్ర వాటా - రూ.1,144.5 కోట్లు (భూసేకరణ కాకుండా)
జిల్లాలో అవసరమైన భూములు - 2,267.54 ఎకరాలు	సేకరించాల్సింది - 1,590.68 ఎకరాలు
ఇప్పటివరకు వెచ్చించింది - రూ.700 కోట్లు	

ఈ ఏడాది బడ్జెట్లో కేటాయించింది రూ.460 కోట్లు



- ముందుకు కదలని నడికుడి – శ్రీకాళహస్తి రైల్వేలైన్
- కేంద్రం నిధులిస్తున్నా శ్రద్ధ చూపని రాష్ట్ర సర్కార్
- భూసేకరణ పేరుతో కాలయాపన
- నేటికీ పరిహారానికి నోచుకోని అనేక మంది
- ఊరించి.. ఉసూరుమనిపిస్తున్న వైనం



దర్శి వరకు పూర్తయిన రైల్వే లైన్

ఉదయగిరి: మెట్ట ప్రాంత వాసుల దశాబ్దాల కల నడికుడి – శ్రీకాళహస్తి రైల్వే లైన్. ఎన్నో ఏళ్లుగా ఈ ప్రతిపాదన ఊరించి.. ఉసూరుమనిపిస్తూనే ఉంది. 2014 – 19 మధ్య టీడీపీ హయాంలో ప్రాజెక్ట్ పనులు నత్తనడకన సాగాయి. ఈ తరుణంలో 2019లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పడ్డాక, పనులు ఊపందుకున్నాయి. దర్శి వరకు ట్రయిల్ రన్‌ను నిర్వహించడంతో ఇక తమ ప్రాంతంలోనూ పనులు పూర్తవుతాయని అంతా భావించారు. అయితే తాజాగా కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది.



భూములు కోల్పోయిన రైతులతో గ్రామసభ (ఫైల్)

రాష్ట్ర ప్రభుత్వ చిన్నచూపు

వాస్తవానికి ఈ ప్రాజెక్ట్‌కు నిధులను కేంద్ర ప్రభుత్వం ఇస్తోంది. అయితే భూసేకరణతో పాటు తమ వాటాను రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వకపోవడంతో పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారాయి. మల్టీపర్పస్‌గా ఉన్న ఈ లైన్‌పై రాష్ట్ర ప్రభుత్వం చిన్నచూపు చూస్తుండటంతో ఈ ప్రాంత వాసుల ఆశలు ఎప్పటికి నెరవేరుతాయో అంతుచిక్కడంలేదు.

41 ఏళ్ల క్రితమే సర్వే

పల్నాడు జిల్లా నడికుడి జంక్షన్ నుంచి కనిగిరి, ఉదయగిరి, ఆత్మకూరు, వెంకటగిరి నియోజకవర్గాలను కలుపుతూ శ్రీకాళహస్తి వరకు రైల్వే లైన్ నిర్మాణానికి సర్వేను 1983లోనే ప్రారంభించారు. తదనంతరం కార్యరూపం దాల్చలేదు. చివరికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సీఎంగా కిరణ్‌కుమార్‌రెడ్డి ఉన్న సమయంలో లైన్‌కు అడుగులుపడ్డాయి. భూసేకరణ చేసి స్వాధీనపర్చడంతో పాటు ప్రాజెక్ట్ వ్యయంలో 50 శాతాన్ని భరించేందుకు అప్పటి ప్రభుత్వం ముందుకొచ్చింది.

గత టీడీపీ ప్రభుత్వంలోనూ ఇంతే..

2014 – 19 మధ్య అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం ఈ లైన్‌పై నిర్లక్ష్య ధోరణిని కనబర్చింది. సర్వే పనులనూ పూర్తి చేయలేదు. ఫలితంగా అంచనా వ్యయం పెరుగుతూ వచ్చింది. నిజానికి లైన్ నిర్మాణానికి మొదట్లో 55 నుంచి 60 మీటర్ల వెడల్పుతో స్థలాన్ని సేకరించాలని నిర్ణయించారు. అయితే చివరి వరకు దీనిపై ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోలేదు.

జగన్ చొరవతో చిగురించిన ఆశలు

2019లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పడ్డాక, ఈ లైన్‌పై సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపారు. సర్వే నిర్వహించిన దాని కంటే అధికంగా 130 మీటర్ల మేర స్థలాన్ని సేకరించారు. పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో పూర్తిగా.. నెల్లూరు జిల్లాలో కొంతమేర సేకరించి పరిహారాన్ని ఇచ్చారు. కరోనా సమయంలో ఆర్థికంగా ఇబ్బందులు ఏర్పడినా, దర్శి వరకు లైన్‌ను పూర్తి చేసి ట్రయల్ రన్‌నూ నిర్వహించారు. దర్శి నుంచి కనిగిరి వరకు శరవేగంగా.. కనిగిరి – పామూరు మధ్య వంతెనల పనులు ప్రారంభమయ్యాయి. అయితే ఇటీవల కూటమి ప్రభుత్వం ఏర్పడటంతో పనులు నిలిచిపోయాయి.

ఇదీ తంతు..

జిల్లాలో సర్వే పనులు అంతంతమాత్రంగా జరుగుతున్నాయి. కొన్ని మండలాల్లో పూర్తికాగా, భూసేకరణకు సంబంధించిన గ్రామసభలను నిర్వహిస్తున్నారు. పరిహారాన్ని ఇవ్వలేదు. దీని కోసం రూ.700 కోట్లు ఖర్చు చేశారని అంచనా. ప్రస్తుత బడ్జెట్లో రూ.460 కోట్లను కేంద్రం కేటాయించింది. రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా మరో రూ.460 కోట్లను కేటాయించి భూములను సేకరిస్తే, వచ్చే రెండేళ్లలో పనులు పూర్తి చేయొచ్చని అధికారులు పేర్కొంటున్నారు.

పూర్తయితే రయ్..రయ్

రైల్వే లైన్ పొడవు 309 కిలోమీటర్లు కాగా, జిల్లాలో 146 కిలోమీటర్లు ఉంటుంది. మొత్తం 33 స్టేషన్లు కాగా, జిల్లాలోనే ఈ సంఖ్య 15. వరికుంటపాడు మండలం కాకొల్లువారిపల్లి, వింజమూరు మండలం గోళ్లవారిపల్లి, రావిపాడు, వింజమూరు మండల కేంద్రాల్లో స్టేషన్లను ఏర్పాటు చేయనున్నారు. ఏఎస్‌పేటలోని దూబగుంట, ఆత్మకూరు మండలంలోని పమిడిపాడు, ఆత్మకూరు, చేజర్ల మండలాల్లో ఓబులాయపల్లి, కొత్తూరు, రాపూరు మండలంలోని వెంకటాపురం, ఆదూరుపల్లి తదితర ప్రాంతాల్లో స్టేషన్లను నిర్మించాల్సి ఉంది.

బహుళ ప్రయోజనాలు..

- ఈ లైన్ రాష్ట్రాభివృద్ధితో పాటు రవాణాలో కీలకపాత్ర పోషిస్తుందని జాతీయ సర్వేలో వెల్లడైంది.
- విజయవాడ – చెన్నై మార్గానికి ప్రత్యామ్నాయంగా ఉంటుంది. వరదలు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో నడికుడి – శ్రీకాళహస్తి రైల్వే లైన్ కీలకంగా మారే అవకాశం ఏర్పడుతుంది. తిరుపతి – హైదరాబాద్ మధ్య 80 కిలోమీటర్ల దూరం తగ్గుతుంది.
- మెట్ట ప్రాంతంలో వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తులు.. సిమెంట్, గ్రానైట్ రవాణాకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.
- జిల్లాలోని మెట్ట ప్రాంతాల్లో రవాణా సౌకర్యంతో పాటు ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయి.



త్వరలో పరిహారం

రైల్వే లైన్లో భూములు కోల్పోయిన రైతులకు పరిహారాన్ని త్వరలో అందిస్తాం. దీనికి సంబంధించిన సర్వే చేశాం. ప్రక్రియను వేగవంతం చేస్తున్నాం. పనులను జిల్లాలో వచ్చే ఏడాది ప్రారంభించేలా భూసేకరణను పూర్తి చేస్తాం. **– వంశీకృష్ణ, ఆర్డీఓ, కావలి**

అన్నదాతకు అండగా వైఎస్సార్సీపీ

- రైతులను మోసగించిన కూటమి ప్రభుత్వం
- కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత రేపు
- మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి, విజయకుమార్‌రెడ్డి తదితరులు

నెల్లూరు(బారకాసు): కూటమి ప్రభుత్వంలో రైతులు దగాకు గురవుతున్నారని మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆరోపించారు. అన్నదాతకు అండగా వైఎస్సార్సీపీ పేరుతో రూపొందించిన పోస్టర్లను డైకస్ రోడ్డులోని తన క్యాంప్ కార్యాలయంలో పలువురు నేతలతో కలిసి బుధవారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వ తీరుతో రాష్ట్రంలోని రైతుల పరిస్థితి దయనీయంగా మారిందని, ఈ క్రమంలో వారికి తమ పార్టీ అండగా నిలుస్తోందని చెప్పారు. రైతన్నల సమస్యలను పరిష్కరించాలని.. ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి, అన్నదాతలకు న్యాయం చేసేందుకు రాష్ట్రవ్యాప్త కార్యక్రమానికి పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారని వివరించారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ కలెక్టర్‌కు వినతిపత్రాన్ని శుక్రవారం అందజేయనున్నామని పేర్కొన్నారు. నగరంలోని వీఆర్సీ కూడలిలో గల అంబేడ్కర్ విగ్రహానికి ఉదయం పది గంటలకు పూలమాల వేసి, కలెక్టరేట్ వరకు ర్యాలీగా వెళ్లనున్నామని వెల్లడించారు. రైతులు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.

ధాన్యం కొనుగోళ్లలో అవకతవకలు

రైతులకు పెట్టుబడి సాయంగా రూ.13,500ను తమ పార్టీ హయాంలో అందించామని వివరించారు. దీన్ని రూ.20 వేలకు పెంచుతామని చెప్పి, సీఎం చంద్రబాబు మోసం చేస్తున్నారని ఆరోపించారు. రైతులకు సంబంధించిన బీమా ప్రీమియాన్ని గతంలో తమ ప్రభుత్వమే భరించిందని, ప్రస్తుతం ఈ భారాన్ని వారిపై మోపుతున్నారని ధ్వజమెత్తారు. ధాన్యం కొనుగోళ్లలో అవకతవకలు జరుగుతుండటంతో అన్నదాతలు తీవ్రంగా నష్టపోతున్నారని చెప్పారు. పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆనం విజయకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్లకు కాసులు



రోడ్డు పక్కన తవ్వేసిన మట్టిని టర్బో లారీలో లోడ్ చేస్తున్న జేసీబీ



విస్తరణ కోసం తవ్విన రోడ్డు

- కల్పతరువుగా మారిన మైపాడు రహదారి విస్తరణ
- రోడ్డుకిరువైపులా తవ్విన మట్టిని కొల్లగొడుతూ..
- టిప్పర్ లోడ్ ధర రూ.15 వేలు
- పట్టించుకోని అధికారులు

ప్రజల రాకపోకలను సులభతరంగా మార్చాలనే లక్ష్యంతో చేపట్టిన నెల్లూరు – మైపాడు రోడ్డు విస్తరణ పనులు కాంట్రాక్టర్లకు కల్పతరువుగా మారాయి. పనులను అటుంచి రహదారికి ఇరువైపులా లభించే మట్టిని తవ్వేసి లేఅవుట్లకు తరలించి భారీగా సొమ్ము చేసుకుంటున్నారు. దొరికిందే అవకాశంగా భావిస్తూ యంత్రాల సాయంతో కొల్లగొడుతున్నారు. వాస్తవానికి రోడ్డు కింద లేయర్లను పటిష్టపర్చేందుకు మట్టిని తవ్వి, రహదారికి అటూ ఇటూ బరమ్స్‌గా వినియోగించాల్సి ఉంది. అయితే మట్టి నాణ్యతగా ఉండటంతో తరలిస్తూ భారీగా వెనుకేసుకుంటున్నారు.

నెల్లూరు (బారకాసు): మైపాడు రోడ్డు విస్తరణ పనులు కాంట్రాక్టర్లకు కాసుల వర్షాన్ని కురిపిస్తోంది. నిర్మాణ పనుల్లోని నిబంధనలు వీరి పాలిట వరమయ్యాయి. నెల్లూరు నుంచి ఇందుకూరుపేట మండలం మైపాడు వరకు వెళ్లే ప్రధాన రహదారి అభివృద్ధిని దశాబ్దాల పాటు గత పాలకులు విస్మరించారు. ఈ క్రమంలో దీని అభివృద్ధే లక్ష్యంగా గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో అప్పటి మంత్రి అనిల్‌కుమార్‌యాదవ్ నడుంబిగించారు. నాలుగు వరుసలుగా అభివృద్ధి చేయాలని సంకల్పించి, రెండు దశల్లో పనులు చేపట్టేందుకు ప్రణాళికను రూపొందించారు. ఈ మేరకు నాటి ప్రభుత్వం రూ.68 కోట్లను మంజూరు చేసింది. తొలి దశలో నగరంలోని పాత చెక్‌పోస్ట్ నుంచి మూడో డివిజన్ పరిధిలోని వేణుగోపాల్‌నగర్ వరకు దాదాపు రూ.20 కోట్లతో నాలుగు వరుసల సిమెంట్ రోడ్డును సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు. రెండో దశలో మూడో మైలు నుంచి మైపాడు బీచ్ వరకు దాదాపు 18 కిలోమీటర్ల రోడ్డును రూ.48 కోట్లతో చేపట్టాల్సి ఉంది. ఈ పనులే ఇప్పుడు కాంట్రాక్టర్లకు కల్పతరువుగా మారాయి.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

మైపాడు రోడ్డును పది మీటర్ల మేర విస్తరిస్తున్నాం. రోడ్డు కింద పటిష్టం చేసి, ఆ తర్వాత మట్టిని ఇరువైపులా పోయాల్సి ఉంటుంది. అయితే వీటిని తరలిస్తున్న విషయం మా దృష్టికి రాలేదు. నిబంధనలను పాటించకపోతే వదిలిపెట్టే ప్రసక్తే లేదు. కాంట్రాక్టర్ చేసిన పనికి సంబంధించిన నిధులు మా వద్దే ఉన్నాయి. ఒక వేళ మట్టిని తిరిగి ఏర్పాటు చేయకపోతే అందుకయ్యే ఖర్చును లెక్కగట్టి మిగిలిన బిల్లులే చెల్లిస్తాం.

– వేణుగోపాల్, డీఈఈ, ఆర్ అండ్ బీ

మట్టితో భారీగా ఆర్జన

ప్రస్తుతం ఉన్న రోడ్డును అటూ ఇటూ 10 మీటర్ల మేర విస్తరించాల్సి ఉంది. ఈ ప్రాంతం నుంచి మైపాడు వరకు రహదారి పక్కనే ఉండే మట్టి నాణ్యతగా ఉంది. దీంతో రోడ్డుకిరువైపులా తవ్వేసిన మట్టిని టిప్పర్ రూ.15 వేల చొప్పున కాంట్రాక్టర్లు విక్రయించుకుంటున్నారు. వాస్తవానికి రోడ్డు నిర్మాణంలో ఇరువైపులా ఉండే మట్టిని తవ్వేందుకు సైతం టెండర్‌లోనే నిధులు కేటాయిస్తారు. అయితే ప్రస్తుతం పది మీటర్ల వెడల్పు, రెండున్నర అడుగుల లోతులో తవ్వుతున్నారు. ఇలా కొల్లగొట్టిన దాన్ని విక్రయిస్తూ కాంట్రాక్టర్లు సొమ్ము చేసుకుంటున్నారు. నిజానికి రహదారి నిర్మాణాన్ని చేపట్టే ముందే కొంత దూరం తవ్వి.. కంకర, గ్రావెల్‌తో పటిష్టపర్చాల్సి ఉంది. అయితే కాంట్రాక్టర్లు ఈ పనులను వదిలేసి మట్టిని కొల్లగొట్టి లేఅవుట్లకు విక్రయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ తంతు సాగుతున్నా, ఆర్ అండ్ బీ, మైనింగ్ అధికారులు పట్టించుకోకపోవడంపై విస్మయం వ్యక్తమవుతోంది.

టీబీ నివారణే లక్ష్యంగా పనిచేయాలి



మాట్లాడుతున్న ఖాదర్‌వలీ

నెల్లూరు(అర్బన్): జిల్లాలో టీబీని నివారించడమే లక్ష్యంగా ఆరోగ్య సిబ్బంది కృషి చేయాలని జిల్లా టీబీ, లెప్రసీ నివారణాధికారి ఖాదర్‌వలీ పేర్కొన్నారు. నగరంలోని డీఎల్వో కార్యాలయంలో భవ్య ఎన్జీఓ, టీబీ నివారణ సిబ్బందితో బుధవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రైవేట్ డాక్టర్లు తమ వద్దకు వచ్చిన రోగులను పరీక్షించి వారిలో టీబీ బాధితులను గుర్తించేలా అధికారులు కృషి చేయాలని కోరారు. ఇలా గుర్తించిన కేసులను ఫీల్డ్ కో ఆర్డినేటర్లకు తెలియజేయాలని సూచించారు. టీబీ రోగుల వివరాలను ఆన్‌లైన్లో నమోదు చేసి ఆర్నెల్ల పాటు ఉచితంగా మందులతో పాటు పౌష్టికాహారానికి నగదును అందజేయనున్నారని వివరించారు. భవ్య ఎన్జీఓ జిల్లా కో ఆర్డినేటర్ తులసీరామ్, పీపీఎం కో ఆర్డినేటర్ హరీష్, టీబీ నివారణ జిల్లా కో ఆర్డినేటర్ విజయ్, పీఎండీటీ కో ఆర్డినేటర్ శ్రావణ్ పాల్గొన్నారు.

ఐటీఐల్లో స్కిల్ అవర్

నెల్లూరు (టౌన్): జిల్లాలోని ప్రభుత్వ ఐటీఐల్లో స్కిల్ అవర్‌ను డైరెక్టర్ ఆఫ్ ఎంప్లాయ్‌మెంట్ ట్రైనింగ్ ఆదేశాల మేరకు ప్రతి బుధవారం నిర్వహించనున్నామని ప్రభుత్వ బాలికల ఐటీఐ ప్రిన్సిపల్ ఏడుకొండలు తెలిపారు. వెంకటేశ్వరపురంలోని ప్రభుత్వ బాలికల ఐటీఐలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమాన్ని ఉదయం పది నుంచి 11 గంటల వరకు నిర్వహించనున్నామని, ఆయా పరిశ్రమల్లో నైపుణ్యాలను ఏ విధంగా పెంపొందించుకోవాలనే అంశాన్ని విద్యార్థులకు తెలియజేయనున్నామని చెప్పారు.

సొసైటీల్లో ఎరువులు నిల్

రైతులకు సేవలు అందించాల్సిన ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు (పీఏసీఎస్) జిల్లాలో నిరుపయోగంగా మారాయి. నిర్వహణా లోపాలతో రైతులకు ఎరువులు కూడా పంపిణీ చేసే స్థితిలో లేకుండా పోయాయి. ఎరువులు కావాలని అన్నదాతలు సొసైటీ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఇదే అదనుగా భావిస్తున్న ప్రైవేట్ డీలర్లు అందినకాడికి దోపిడీ చేస్తున్నారు.

– కందుకూరు

- పంపిణీకి ముందుకు రాని పీఏసీఎస్‌లు
- జిల్లాలో 78 పీఏసీఎస్‌లకు 45 మాత్రమే నిర్వహణ
- ఇదే అదనుగా రైతులను దోచుకుంటున్న ప్రైవేట్ డీలర్లు



ఎరువుల బస్తాలు



➡ జిల్లాలో మొత్తం 78 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలున్నాయి. వీటిలో ప్రస్తుతం 45 మాత్రమే నిర్వహణలో ఉండగా, మిగిలిన 33 సొసైటీలు అసలు నిర్వహణలోనే లేవు.

➡ కందుకూరు నియోజకవర్గంలో 14 పీఏసీఎస్‌లు ఉండగా, వాటిలో కేవలం ఒక చోటే ఎరువులు అందుబాటులో ఉన్నాయి. మిగిలిన వాటిలో ఎక్కడా బస్తా ఎరువు కూడా లేదు.

➡ ప్రస్తుతం ముమ్మరంగా రబీ వ్యవసాయ సీజన్ సాగుతోంది. యూరియా, పాస్ఫేట్, 20 – 20 – 20, అమ్మోనియా తదితర ఎరువుల అవసరం రైతులకెంతో ఉంది. వీటి కోసం సొసైటీ కార్యాలయాల చుట్టూ రైతులు తిరుగుతున్నా సరఫరా చేయడం లేదు.

➡ ఎరువుల లైసెన్స్‌లు తీసుకున్నా, స్టాక్ తెప్పించి రైతులకు ఇచ్చేందుకు పీఏసీఎస్‌లు ససేమిరా అంటున్నాయి. సిబ్బంది కొరత, బిల్డింగ్‌లు లేక ఎరువులు నిల్వ చేసేందుకు స్టాక్ పాయింట్ సమస్యగా ఉందని చెప్తున్నాయి.

➡ సొసైటీల్లో ఎరువులు లేకపోవడంతో రైతులు తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేట్ డీలర్లను ఆశ్రయించాల్సి వస్తోంది. ఇదే అదనుగా వారు ఎరువుల ధరలు పెంచి విక్రయిస్తున్నారు. యూరియా 45 కిలోల బస్తా ధర రూ.266.50 కాగా, ప్రస్తుతం కందుకూరు పట్టణంలోని డీలర్లు రూ.350 వరకు వసూలు చేస్తున్నారు. మ్యూరెట్ ఆఫ్ పొటాష్ బస్తా ధర రూ.1550లు కాగా, బస్తాపై రూ.100 వరకు అధికంగా వసూలు చేస్తున్నారు.

➡ గత వైఎస్సార్సీపీ ప్రభుత్వంలో సీజన్‌కు ముందే రైతులకు అవసరమైన ఎరువులను అందుబాటులో ఉంచేవారు. అప్పట్లో రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రతి గ్రామంలో సమృద్ధిగా ఎరువులు దొరికేవి. ఒక వేళ అందుబాటులో లేకపోయినా కియోస్కల ద్వారా నగదు చెల్లించిన వెంటనే రైతులకు ఎరువులు అందుబాటులోకి వచ్చేవి.



క్లుప్తంగా

ఆర్థిక సాయం అందజేత



చెక్కు అందజేస్తున్న నాయబ్ రసూల్ ప్రతినిధులు

సాక్షి ఎఫెక్ట్..

ఆత్మకూరు: పట్టణంలోని చావడి వీధికి చెందిన షేక్ షాన్‌వాజ్ కుటుంబానికి మండలంలోని నాగులపాడు గ్రామానికి చెందిన కాంట్రాక్టర్ సయ్యద్ నాయబ్ రసూల్ రూ.20 వేల ఆర్థిక సాయం చేశారు. అనారోగ్యంతో బాధపడుతూ మంచానికే పరిమితమైన షాన్‌వాజ్‌పై 'చిన్న కుటుంబం.. పెద్ద కష్టం' అనే శీర్షికతో బుధవారం సాక్షిలో కథనం వచ్చిన విషయం తెలిసిందే. దీంతో నాయబ్ రసూల్ ఆర్థిక సాయాన్ని పంపించారు. అతని బంధువులు బాధిత కుటుంబానికి చెక్కును అందజేశారు.

బాలిక అదృశ్యం

వెంకటాచలం: మండలంలోని కంటేపల్లి గ్రామానికి చెందిన బూదూరు పూజిత (15) అనే బాలిక అదృశ్యమైందని ఆమె తల్లి రత్నమ్మ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈనెల 9 తేదీ ఉదయం నుంచి పూజిత కనిపించడం లేదు. కుటుంబ సభ్యులు బంధువుల గ్రామాల్లో విచారించినా ఆచూకీ తెలియరాలేదు. దీంతో బాధిత తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

నెల్లూరు(క్రైమ్): రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహం ఛిద్రమై గుర్తుపట్టలేని విధంగా తయారైంది. ఈ ఘటన బుధవారం నెల్లూరు కొండాయపాళెం గేటు సమీపంలో చెన్నై వైపు వెళ్లే రైలు పట్టాలపై జరిగింది. మృతుడి వయసు 40 నుంచి 45 ఏళ్ల మధ్య ఉండొచ్చని భావిస్తున్నారు. క్రీమ్ కలర్ హాఫ్ హ్యాండ్స్ టీషర్ట్, బ్లూ కలర్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. రైల్వే ఎస్సై జి.మాలకొండయ్య ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి ఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆయుర్వేద దుకాణం సీజ్



తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్

నెల్లూరు(క్రైమ్): ఆయుర్వేద మందులు తయారీ చేసి విక్రయిస్తున్న దుకాణాన్ని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బుధవారం సీజ్ చేశారు. వారి కథనం మేరకు.. నెల్లూరు నగరంలోని గాంధీబొమ్మ సమీపంలో ఉన్న శ్రీశివదుర్గా ఆయుర్వేదిక్ నిలయ నిర్వాహకులు ఎలాంటి అనుమతులు లేకుండా సొంతంగా ఆయుర్వేద మందులు తయారు చేసి విక్రయిస్తున్నట్లు విజిలెన్స్ ఎస్పీ పీఆర్ రాజేంద్రకుమార్‌కు ఫిర్యాదులు అందాయి. ఆయన ఆదేశాల మేరకు విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీహరి ఆయుష్ శాఖ సిబ్బందితో కలిసి తనిఖీలు చేశారు. రూ.6,97,839 విలువైన మందులతోపాటు దుకాణాన్ని సీజ్ చేశారు. తదుపరి దర్యాప్తునకు విజయవాడలోని ఆంధ్రా బోర్డు ఫర్ ఆయుర్వేదిక్ అండ్ హోమియోపతి రిజిస్ట్రార్‌కు లేఖ రాస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. జిల్లా ఆయుష్ అధికారి డాక్టర్ గోవిందయ్య పాల్గొన్నారు.

తండ్రీకొడుకుల మధ్య వాగ్వాదం

- రాళ్లపై పడిన కుమారుడు
- చికిత్స నిమిత్తం తరలిస్తుండగా మృతి



గ్రామంలో విచారిస్తున్న సీఐ, ఎస్సైలు



మస్తాన్ మృతదేహం

సోమశిల: మద్యం మత్తులో తండ్రీకొడుకుల మధ్య వాగ్వాదం జరిగింది. ఈ సమయంలో కుమారుడు ప్రమాదవశాత్తు రాళ్లపై పడి గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందిన ఘటన మండలంలోని ఇనగలూరు గ్రామంలో జరిగింది. గ్రామస్తులు, పోలీసుల కథనం మేరకు.. షేక్ నబీసాహెబ్, ఆయన కుమారుడు మస్తాన్ (45) మధ్య కుటుంబ కలహాలున్నాయి. వీరు మంగళవారం మద్యం తాగి ఘర్షణ పడ్డారు. ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఈ సమయంలో మస్తాన్ రాళ్లపై పడి గాయపడ్డాడు. అతని తల్లి వెంటనే ఆత్మకూరులోని ప్రభుత్వాస్పత్రికి తరలించింది. చికిత్స అనంతరం ఇంటికొచ్చారు. బుధవారం మస్తాన్ మళ్లీ అనారోగ్యానికి గురికావడంతో ఆత్మకూరులోని వైద్యశాలకు తరలిస్తుండగా మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహానికి పోస్టుమార్టం చేయించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మస్తాన్ భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సూర్యప్రకాష్‌రెడ్డి తెలిపారు. ఆత్మకూరు సీఐ గంగాధర్, ఎస్సైలు గ్రామంలో విచారణ నిర్వహించారు.

నగరాన్ని కమ్మేసిన పొగమంచు

నెల్లూరులో బుధవారం వాతావరణం మారిపోయింది. ఓవైపు ఆకాశం మేఘావృతమైంది. మరోవైపు పొగమంచు దట్టంగా కమ్మేసింది. ఎటుచూసినా ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంది. పొగమంచు మాటున నగరం సరికొత్తగా దర్శనమిచ్చింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు



ఉదయం 10.30 సమయంలో స్వర్ణాల చెరువు వద్ద ఇలా..



పొగమంచు మాటున నగరం



దట్టమైన పొగమంచులో జీవన పోరాటం

నాగమ్మ ఆలయం కూల్చివేత

- రహదారి విస్తరణ పేరుతో..
- నెల్లూరులో ఘటన
- భక్తుల ఆగ్రహం, బీజేపీ నేతల నిరసన



ఆలయం ఎదుట నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకుడు మిడతల రమేష్ తదితరులు

నెల్లూరు(బృందావనం): నెల్లూరులో రహదారి విస్తరణ పేరుతో నాగమ్మ ఆలయాన్ని కూల్చివేసి దేవతామూర్తుల విగ్రహాలను తొలగించారని హిందువులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నగరంలోని డైకస్‌రోడ్డు సెంటర్‌లో రహదారి వెడల్పు ప్రక్రియకు అధికారులు, కాంట్రాక్టర్లు ఉపక్రమించారు. ఈ క్రమంలో బుధవారం అక్కడి నాగమ్మ ఆలయాన్ని కూల్చివేశారు. ఎటువంటి సమాచారం లేకుండా వచ్చిన అధికారులు, కాంట్రాక్టర్ వ్యవహరించిన తీరుతో భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కూల్చివేతను ప్రతిఘటించేందుకు యత్నించారు. అయితే అధికారులు, కాంట్రాక్టర్ వారిని భయాందోళనలకు గురిచేశారు. సమాచారం అందుకున్న బీజేపీ నాయకుడు మిడతల రమేష్ ఆ ప్రాంతానికి చేరుకుని అధికారులు, కాంట్రాక్టర్ తీరుపై మండిపడ్డారు. స్థానికులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు దశాబ్దాలకుపైగా డైకస్‌రోడ్డు సెంటర్‌లో పూజలందుకుంటున్న నాగమ్మ పుట్ట ఆలయం పడగొట్టి మహాలక్ష్మి అమ్మవారి విగ్రహాన్ని పెకలించి పక్కన పెట్టేశారన్నారు. అలాగే ఆలయంలో ఉన్న వినాయక విగ్రహం కుడి చేతిని విరగ్గొట్టారని ఆగ్రహించారు. రహదారి పనుల విస్తరణలో అనుసరించాల్సిన నిబంధనలను అటు అధికారులు, ఇటు కాంట్రాక్టర్ పాటించకుండా, వర్క్ ఆర్డర్ తీసుకోకుండా అత్యుత్సాహంతో ఆలయాన్ని కూలగొట్టడం క్షమించరాని నేరమన్నారు. ప్రభుత్వానికి రహదారి విస్తరణ తప్పనిసరైతే ముందుగా నోటీసు లేదా సమాచారం ఇవ్వాల్సి ఉందన్నారు. అలా చేయకుండా హిందువుల ఆలయాన్ని కూల్చడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా హిందూ చైతన్య వేదిక వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్థానిక నాయకులు కరణం వెంకట్రావ్, అగ్గిపోతు మణి, పెద్దపాలపు కోటయ్య తదితరులు పాల్గొన్నారు.



కూల్చేసిన ఆలయం వద్ద వినాయక విగ్రహం

అధికార పార్టీ ప్రజాప్రతినిధులెక్కడ?

కూటమి ప్రభుత్వానికి హిందువులు, హైందవ ధర్మంపై గౌరవం లేదన్న విషయం ఈ ఘటనతో తేటతెల్లమైందని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు ఈ ఘటనపై స్పందించకపోవడంపై మండిపడుతున్నారు.

తీర్మానాలు లేకుండా సంతకాలా?

- అధికారులతో పొదుపు మహిళల వాగ్వాదం
- వీఓఏలను తొలగించేందుకేనా?



అధికారులను ప్రశ్నిస్తున్న మహిళలు

వెంకటాచలం: మండలంలోని పాలిచెర్లపాడులో బుధవారం సాయంత్రం పొదుపు గ్రూపు సంఘాల సభ్యులతో నిర్వహించిన సమావేశంలో మహిళలు అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఈ కార్యక్రమానికి డీపీఎం కామాక్షి, ఏపీఎం రుణ్మికి హాజరయ్యారు. పొదుపు మహిళల చేత సంతకాలు చేయించే ప్రయత్నం చేశారు. సమావేశం ఎందుకు నిర్వహించారని, తీర్మానాలు లేకుండా సంతకాలు ఎందుకు పెట్టాలని వారు ప్రశ్నించగా ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. వీఓఏగా ఉన్న సుభాషిణిని తొలగించేందుకే మీరు సంతకాలు చేయాలని చెబుతున్నారని, ఎట్టి పరిస్థితుల్లోనూ అలా చేసేది లేదని మహిళలు తెగేసి చెప్పారు. దీంతో అధికారులు సమావేశాన్ని ఆపేసి వెళ్లిపోయారు. అలాగే మండలంలోని ఎగువమిట్ట, ఇడిమేపల్లి గ్రామాల్లోనూ పొదుపు సంఘాల మహిళలతో సమావేశం నిర్వహించారు. గతంలో పనిచేస్తున్న వీఓఏలను తొలగించేందుకే ఇవి నిర్వహించారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనిపై డీపీఎం మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల ప్రకారమే సమావేశాలు నిర్వహించామని తెలిపారు.

కప్పరాళ్లతిప్పలో కార్డన్ సెర్చ్

- 49 వాహనాల స్వాధీనం
- పోలీసుల అదుపులో ముగ్గురు అనుమానితులు



స్వాధీనం చేసుకున్న వాహనాలను పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీధర్

బిట్రగుంట: బోగోలు మండలం కప్పరాళ్లతిప్పలో బుధవారం పోలీసులు భారీ స్థాయిలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశాల మేరకు కావలి డీఎస్పీ శ్రీధర్ ఆధ్వర్యంలో సబ్‌డివిజన్ పరిధిలోని ఐదుగురు సీఐలు, 12 మంది ఎస్సైలు, 100 మందికిపైగా సిబ్బంది తెల్లవారుజామున 5 నుంచి ఉదయం 7 గంటల వరకూ బృందాలుగా విడిపోయి కప్పరాళ్లతిప్ప అంతా విస్తృతంగా తనిఖీలు చేశారు. స్థానికంగా ఉండే పాత నేరస్తులు, అనుమానితులు, రౌడీషీటర్లు తదితరుల నివాసాలతోపాటు ప్రతి ఇంట్లో తనిఖీలు నిర్వహించారు. రికార్డుల్లేని 47 ద్విచక్ర వాహనాలను, ఒక ఆటో, ఒక మినీ ట్రక్‌ను స్వాధీనం చేసుకున్నారు. తిప్పలో అనుమానాస్పదంగా ఉన్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వివరాలు సేకరిస్తున్నారు. కార్డన్ సెర్చ్ అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ వివరాలు వెల్లడించారు. పాతనేరస్తులు, పోలీసు రికార్డుల్లో నమోదైన వ్యక్తులకు కౌన్సెలింగ్ ఇస్తామన్నారు. ఇకపై తరచూ ఆకస్మిక దాడులు నిర్వహించనున్నట్లు వివరించారు. కావలి రూరల్ సర్కిల్, కావలి రూరల్ పీఎస్, ఒకటి, రెండో పట్టణ సీఐలు, కలిగిరి సీఐ, సబ్ డివిజన్ పరిధిలోని ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.


డిగ్రీ పరీక్షల్లో ముగ్గురి డిబార్

వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) పరిధిలోని అనుబంధ కళాశాలల్లో బుధవారం నిర్వహించిన డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షల్లో ముగ్గురు విద్యార్థులను డిబార్ చేసినట్లు వర్సిటీ పరీక్షల నిర్వహణాధికారిణి డాక్టర్ ఆర్.మధుమతి తెలిపారు. 8,602 మందికి గానూ 901 మంది గైర్హాజరయ్యారని వెల్లడించారు.

హైకోర్టును ఆశ్రయించిన డీడీ

నెల్లూరు(సెంట్రల్): జిల్లా మైనింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ చంద్రశేఖర్‌ను ఇటీవల కలెక్టర్ ప్రభుత్వానికి సరెండర్ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తనకు అన్యాయం జరిగిందని చంద్రశేఖర్ హైకోర్టును ఆశ్రయించారు. సరెండర్‌ను రద్దు చేస్తూ కోర్టు ఉత్తర్వులు ఇచ్చింది.

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి : రూ.30
సన్నవి : రూ.20
పండ్లు : రూ.12

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్) : 92
లేయర్ (లైవ్) : 110
బ్రాయిలర్ చికెన్ : 174
బ్రాయిలర్ స్కిన్‌లెస్ : 194
లేయర్ చికెన్ : 187

సాగునీటి సంఘాలకు 14న ఎన్నికలు

- ప్రాజెక్ట్ కమిటీలకు మినహాయింపు
- ఓటర్ల సంఖ్య 3 లక్షలు
- ప్రత్యేకాధికారుల నియామకం



కొడవలూరు: తహసీల్దార్ కార్యాలయంలో నోటిఫికేషన్ విడుదల

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): మూడుసార్లు వాయిదా పడిన సాగునీటి సంఘాల ఎన్నికలను ఈనెల 14వ తేదీన నిర్వహించనున్నారు. సోమశిల, కండలేరు రిజర్వాయర్లకు, డిస్ట్రిబ్యూటరీ కాలువలకు సంబంధించిన ఆరు ప్రాజెక్ట్ కమిటీలకు తప్ప మిగిలిన 13 డిస్ట్రిబ్యూటరీ కాలువలకు, 490 వాటర్ యూజర్ అసోసియేషన్లకు, 3,698 ప్రాతిపదిక నియోజకవర్గాలకు ఎన్నికలు నిర్వహించేందుకు యంత్రాంగం చర్యలు తీసుకుంది. ఇవి ఏకగ్రీవంగా, చేతులెత్తే పద్ధతి, రహస్య ఓటింగ్ పద్ధతుల్లో నిర్వహిస్తారు. జిల్లా వ్యాప్తంగా 3 లక్షల ఓటర్లున్నారు. నిర్వహణకు 9,114 మంది సిబ్బందిని నియమించారు.

అధికారుల నియామకం

పెన్నార్ డెల్టాకు సంబంధించిన సదరన్ ఛానల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీకి నెడ్‌క్యాప్ జిల్లా మేనేజర్ కృష్ణారెడ్డి, ఈస్టర్న్ ఛానల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ–1కు మార్కెటింగ్ ఏడీ అనితాకుమారి, కమిటీ –2కు జిల్లా సహకార శాఖ అధికారి గురప్ప, పైడేరు ఎస్కేప్ ఛానల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ–1కు జిల్లా ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసర్ వినయ్‌కుమార్, కమిటీ –2కు చేనేత, జౌళి శాఖ అధికారి వరప్రసాద్, నెల్లూరు ట్యాంక్ సప్లై ఛానల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీకి జిల్లా ఉద్యాన శాఖ ఏడీ సుబ్బారెడ్డి, జవహర్ సాహెబ్ కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీకి జెడ్పీ డిప్యూటీ సీఈఓ మోహన్‌రావు, సర్వేపల్లి కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీకి జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్‌రెడ్డి, సోమ శిల ప్రాజెక్ట్‌కు సంబంధించిన సౌత్ ఫీడర్ కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీకి డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి, నార్త్ ఫీడర్ కెనాల్ డిస్ట్రిబ్యూటర్ కమిటీకి భూ గర్భ జలవనరుల శాఖ డీడీ శోభన్ బాబు, కావలి కెనాల్ రీచ్–1కు పొల్యూషన్ కంట్రోల్ బోర్డుకు చెందిన అశోక్‌కుమార్, రీచ్–2కు జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ పరిమళ, రీచ్ –3కి ద్వామా డీడీ గంగా భవానీని ప్రతేక అధికారులుగా నియమించారు. మండలాల పరిధిలో బుధవారం అధికారులు ఎన్నికల నోటిఫికేషన్లను విడుదల చేశారు.

పక్కాగా నిర్వహిస్తాం



అక్రమాలకు తావు లేకుండా ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఆయా ప్రాంతాల్లో దండోరా ద్వారా ఓటర్లకు తెలియజేస్తున్నాం. జిల్లాలో ఎన్నికలకు సంబంధించి 13 డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు ప్రత్యేకాధికారులను నియమించాం. ఓటర్ల జాబితాలో పేర్లు తొలగించినట్లు నా దృష్టికి రాలేదు. అర్బనైజేషన్, ల్యాండ్ కన్వర్షన్ జరిగితే ఆయా భూములకు సంబంధించిన యజమానుల పేర్లు ఆటోమేటిక్‌గా రికార్డుల్లో ఉండవు. కాబట్టి ఓటర్ల జాబితాలో ఎటువంటి అవకతవకలు జరగలేదు.

– దేశ్‌నాయక్, ఇరిగేషన్ ఎస్ఈ, ఎన్నికల నోడల్ ఆఫీసర్

'రాజీనామా చేసి వెళ్లిపో'

- మా పార్టీ వారిని నియమించుకుంటాం
- అంగన్‌వాడీ కార్యకర్తకు టీడీపీ నాయకుల బెదిరింపులు



సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసేందుకు వచ్చిన అంగన్‌వాడీ కార్యకర్తలు, యూనియన్ నాయకులు

కందుకూరు రూరల్: 'నువ్వు రాజీనామా చేసి వెళ్లిపో.. మా పార్టీ వారిని నియమించుకుంటాం' అంటూ కందుకూరు మండలం ఓగూరు గ్రామంలో టీడీపీ నాయకులు అంగన్‌వాడీ కార్యకర్తను బెదిరిస్తున్నారు. ఓగూరు ఎస్సీ కాలనీలో అంగన్‌వాడీ కార్యకర్తగా కల్యాణి పదమూడేళ్లుగా పని చేస్తోంది. అదే కాలనీకి చెందిన కొందరు టీడీపీ నాయకులు ఈనెల 7వ తేదీన అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లారు. నువ్వు రాజీనామా చేస్తావా.. మమ్మల్ని చర్యలు తీసుకోమంటావా.. అంటూ పెద్దగా కేకలు వేస్తూ వాదనలకు దిగారు. నా విధుల్లో ఎలాంటి లోపం ఉన్నా చూపించాలని ఆమె ప్రశ్నించారు. నువ్వు మా పార్టీకి సంబంధించి వ్యక్తివి కాదు. కార్యకర్తగా కొనసాగడానికి లేదు' అని బెదిరించి వెళ్లారు. రెండు రోజులుగా అంగన్‌వాడీకి ముగ్గురు పిల్లలను రానివ్వలేదు. అలాగే తల్లులు, గర్భిణులను కూడా కేంద్రానికి వెళ్లి సరుకులు, పౌష్టికాహారం తీసుకోవద్దని నేతలు చెబున్నారు. దీంతో కల్యాణి తమ యూనియన్, సీఐటీయూ నాయకులతో కలిసి సోమవారం సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజకు ఫిర్యాదు చేశారు. వెంటనే చర్యలు తీసుకోవాలని రూరల్ ఎస్సై మహేంద్రనాయక్‌ను ఆమె ఆదేశించారు. దీనిపై ఎస్సైని వివరణ కోరగా ఫిర్యాదు అందిందని విచారణ చేస్తున్నట్లు బుధవారం తెలిపారు.

ఇబ్బంది పెడుతున్నారు

గ్రామానికి చెందిన పి.రఘుబాబు, మనోహర్, మాలిరావు, సురేష్ మరికొందరు కావాలనే పార్టీలు అంటగట్టి నన్ను ఇబ్బంది పెడుతున్నారు. కేంద్రానికి వచ్చి రాజీనామ చేయాలని బెదిరిస్తున్నారు. అనేకసార్లు అసత్యాలతో ఐసీడీఎస్ అధికారులకు ఫిర్యాదులు చేశారు. 13 ఏళ్లగా ఉద్యోగం చేస్తుంటే ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ రాలేదు.

– కల్యాణి, అంగన్‌వాడీ కార్యకర్త